విడిన మబ్బు

—ఇసుకపల్లి సుజాత

దీప పేరుకు తగ్గట్టు రూపంలో దీపంలా వెలుగులు చిందించక పోయినా 'ఫరవాలేదు బాగానే ఉంది' అనిపిస్తుంది.

హాల్లో సోఫా మీద కూర్చుని వీడియో చూస్తున్న దీపకి మనసు మనసులో లేదు. అది ప్రశాంత్ చుట్టూ పరిభ్రమిస్తోంది. కానీ ఆ పరిభ్రమణం యాంత్రికంగా సూర్యుని చుట్టూ ప్రదక్షిణాలు చేసే భూగోళం మాదిరిగా లేదు. తోటలోని పూలు ఎవరైనా కోసుకు పోతారేమోనని అనుమానంతో తోట చుట్టూ తిరిగే కావలి మనిషిలా ఉంది.

హఠాత్తుగా 'దొంగ.... దొంగ' అని కేకలు వినిపించటంతో చప్పున ఉలిక్కి పడ్డది దీప. ఆ కేకలు టీవీలోంచి వచ్చినట్టు తెలుసుకున్న ఆమె మనసు కాస్త కుదుట పడ్డది.

'నా కొట్లోనే దొంగతనం చేస్తున్నావ్ నీ కెంత ధైర్యం! సినిమా హీరోలా ఉన్నావ్ నీకు కన్ను వంకరా కాలు వంకరా? కష్టపడి పని చేసుకుని బతకరాదూ' అంటూ షావుకారు ఒక యువకుణ్ణి పట్టుకుని నాలుగు తంతుంటే చుట్టూ చేరిన జనం నాలుగూ అంటున్నారు.

భరించ లేక పోయింది దీప. అమాంతం ఒక్క అంగలో లేచి వెళ్ళి టీవీ ఆపేసి మళ్ళీ వచ్చి సోఫాలో కూర్చుండి పోయింది.

ఆమె కళ్ళు మునుపటిలా సంతోషంతో మెరవట్లేదు.

గోడ గడియారం 'టింగు' మని గంట కొట్టి చకచకా తన పని తాను చేసుకుపోతోంది. దానికి ఎవ్వరితోడు అక్కరలేదు. ఎవ్వరి కోసమూ అది ఆగదు. ఏ బంధనాలు లేకుండా అది కాలాన్ని ఎలా గడుపుతోందో!

తన పిచ్చి ఆలోచనకు తనకేనవ్వొచ్చింది.

టైము నాలుగున్నర అయ్యింది.

అంటే ప్రశాంత్ ఆఫీసు నుంచి రావటానికి ఇంకా గంటసేపు పడుతుంది.

'అబ్బా' తలనొప్పిగా ఉంది అంటూ కుడి చేతి వేళ్ళతో నొసలు రుద్దుకుంది బాధగా. తల నొప్పికి రకరకాల కారణాలుంటాయంటారు డాక్టర్లు. కంటి చూపులో మార్పు రావటం, ఎక్కువగా శ్రమ పడటం, విపరీతంగా ఆలోచించి భయపడటం– ఇలాంటివి సవా లక్ష చెబుతారు. మరి ఇప్పుడు తనకి తలనొప్పి ఏ కారణం చేత వచ్చినట్టు?

బహుశా మూడో కారణం వల్లనేమో!

'మంగా..... ఓ కప్పు కాఫీ పట్రా' ఆ కారణం తలచుకోగానే తట్టుకో లేక వంట మనిషిని కాఫీ తెమ్మని ఆర్డరిచ్చింది దీప.

కప్పులోని కాఫీ ఖాళీ అవుతున్న కొద్దీ శిరోభారం నెమ్మదిగా దిగుతున్నట్లనిపించింది.

వెంటనే గతం గురించిన ఆలోచనలు దీప మనసు మేఘాల్లా కమ్ముకోవటం ప్రారంభించాయి.

తనకు ప్రశాంత్‌తో పెళ్ళి జరిగిన తీరు తలచుకుంటే గమ్మత్తుగా అనిపిస్తుంది. ఒక్కొక్కసారి నవ్వొస్తుంది కూడాను.

ఆ రోజు తనకు బాగా గుర్తు. తను మామూలుగానే కాలేజీకి వెళ్ళింది. కనకాంబరం రంగు చందేరి చీర కట్టుకుని మెడలో ముత్యాల గొలుసు జడలో కనకాంబరాలతో కాలేజీలోకి అడుగు పెట్టగానే అంతా హడావిడిగా కనిపించింది. ఆ రోజు ఫంక్షన్ కూడా ఏదీ లేదు. కానీ ఆ కలకలానికి కారణం అర్థం కాలేదు తనకి.

ఇంతలో గల గల మంటూ ఫ్రెండ్స్ దీప చుట్టూ మూగారు.

'హాయ్ దీపా..... లేటయితే నువ్వు రావేమో అనుకున్నాము'.

'మన కాలేజీలో ఇవాళ సినిమా షూటింగుట తెలుసా'.

'ఏదో చిన్న సీన్ ఉంది మీ స్టూడెంట్స్‌లో ఎవరైనా యాక్ట్ చేస్తారా అని డైరెక్టర్ మన ప్రిన్సిపాల్‌ని అడిగారట. చక్కగా డ్రెస్ అయి వచ్చావు నువ్వు చెయ్యరాదూ ఆ యాక్షన్' ఒక స్నేహితురాలు పత్తిడి చేసింది.

'అమ్మో నేనా! ఇంకానయం..... నాకు రాదు బాబూ నేను చెయ్యను' అంది దీప బెరుకుగా.

'సరేలే అయితే పద షూటింగ్ చూద్దాం' అంటూ అందరూ చిత్రం యూనిట్ దగ్గరగా నిలబడ్డారు.

డైరెక్టర్ హీరోకి ఏవో సూచన లిస్తున్నాడు.

'అబ్బ .... అటు చూడవే దీపా..... హీరోకంటే అతనెంత బాగున్నాడో! అసలు అతనికివ్వాల్సింది హీరో వేషం'.

పచ్చగా మెరిసిపోతూ దాదాపు 'ఆరడుగుల పొడుగు దానికి తగ్గ లావుతో అచ్చం తెలుగు నవలా నాయకుడిలా ఉన్నాడనిపించింది దీపకి.

సినిమాలో హీరో కాలేజీ మెట్లు దిగుతున్న ఒక అమ్మాయి పైకి పువ్వు విసిరి 'హాయ్ బ్యూటీ' అనాలి.

అదీ సీను.

డైరెక్టర్ పక్కనే గులాబీ పూల బుట్ట కూడా ఉంది. నవలా నాయకుడు తన వంకే చూస్తున్నట్టు దీప గమనించక పోలేదు.

సినిమా హీరోతో పాటు ఆ నవలా నాయకుడు కూడా బుట్టలోంచి ఒక గులాబీ పువ్వును చేతిలోకి తీసుకున్నాడు. ఆ గులాబిని దీప మీదకి విసిరేశాడు. కానీ ఈ విషయం ఆమె తప్ప మరెవ్వరూ గమనించ లేదు.

ఆశ్చర్యంగా అతని వంక చూసి బిడియంగా తల వాల్చేసింది దీప.

అంతే!

ప్రశాంత్ దీపతో పాటు వాళ్ళింటికి రావటం ఆమె తల్లిదండ్రులు అంగీకరించటం దీపా ప్రశాంత్‌ల వివాహం జరిగి పోవటం అన్నీ ఒకదాని వెంట ఒకటి విచిత్రంగా సినిమా మాదిరి జరిగి పోయింది. తరువాత ప్రశాంత్‌కి హైదరాబాద్‌లో మంచి ఉద్యోగం దొరకటంతో బంజారా హిల్స్‌లో ఇల్లు కొనుక్కొని అక్కడే సెటిలయి పోయారు.

బజర్ మోగింది.

హఠాత్తుగా ఈ లోకంలో కొచ్చింది దీప.

ఇందాక వీడియోలో సినిమా

ఇప్పుడు ఊహల్లో సినిమా

ఇందాకటిది నిజమైన సినిమా

ఊహల్లోది చిత్రంగా జరిగిన అసలైన జీవితం.

ఆశ్చర్యంగా అనిపించింది.

కంగారుగా లేచి తలుపు తీసింది దీప.

తమరేదో పరధ్యానంలో ఉన్నట్టున్నారు ఏమిటి విశేషం?' లోపలి కొచ్చి నవ్వుతూ అడిగాడు ప్రశాంత్.

'ఆ..... అది...... అదేంలేదు' నవ్వుని ముఖం మీద పౌడర్‌లా అద్దుకోవటానికి ప్రయత్నించింది.

డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ రెడీగా పెట్టింది మంగ.

ప్రశాంత్ ఉల్లాసంగానే ఉన్నాడు. కానీ దీప మాత్రం ముభావంగా టిఫిన్ పూర్తి చేసింది.

కుర్చీలోంచి లేస్తూ 'కమాన్ దీపా గెట్ రెడీ షికారుగా అలా టాంక్‌బండ్‌కి వెళ్ళొద్దాం పద'. తొందర చేశాడు ప్రశాంత్.

'సారీ..... నేను రానండీ నాకు తల నొప్పిగా ఉంది'. అప్రయత్నంగా నోట్లోంచి వచ్చేశాయి ఆ మాటలు.

ప్రశాంత్ విచిత్రంగా భుజాలు పైకి ఎగరేసి, 'సరే నీ ఇష్టం .... కానీ ఒక్క మాట దీపా. నువ్వు ఈ మధ్య ఎందుకో డల్‌గా ఉంటున్నావు. ఏవిటీ కారణం? నువ్వలా ఉంటే నేను భరించలేను. ప్లీజ్ ఎందుకో చెప్పవూ' అభ్యర్థించాడు ప్రశాంత్.

'ఛ..... అదేం లేదండీ నేను బాగానే ఉన్నాను'.

'అయితే సరే. నేను వెళ్ళి అక్కడ కాస్సేపు కూర్చుని వస్తాను. కానీ ఒక్కటి మాత్రం గుర్తుంచుకో దీపా. నీకు ఏది కావాలన్నా నేనున్నాను. కోరిన వస్తువు చిటికలో నీ ముందుంచుతాను నీ కోసం నీ సంతోషం కోసం' చివరలో గద్గదంగా మారింది ప్రశాంత్ స్వరం.

దీప చలించి పోయింది.

చైత్ర మాసం కావటం వల్లనేమో సూర్యుడు పశ్చిమ సముద్రంలో మునగటానికి బద్ధకిస్తున్నాడు. ఆకాశంలో అలుముకున్న మందార పూ ఛాయ భూమిపై ప్రతిఫలిస్తోంది. ప్రశాంత్ డ్రైవ్

చేస్తున్న ఎర్రని మారుతీ కార్ ఆ మందారంలోంచి దూసుకు పోయి వింత సోయగాలను చిందించింది.

* * * * *

ఛ ..... ప్రశాంత్‌ని అనుమానించటం అంత సమంజసం కాదేమో. ఒక వేళ తను అనుకుంటున్నట్టు అలాంటి వాడే అయితే మరి తనను అంత ప్రేమగా ఎందుకు చూసుకుంటాడు తన బాధను అతని బాధగా ఎందుకు భావించుకుంటాడు?

అసలు తామిద్దరూ ఆ వెధవ సినిమా చూడకుండా ఉండాల్సింది. అప్పట్నుంచే ఈ పాడు అనుమానం తనని పట్టుకు పీడిస్తోంది.

ఏ పని చెయ్యటానికి మనస్కరించట్లేదు. ఎప్పుడూ పరిపరి విధాల ఆలోచిస్తుంది. పరధ్యానంగా కనిపిస్తుంది. తనకు తెలియకుండానే ఆమె మానసికంగా కృంగిపోయింది. మొహంలో కళతప్పింది. ఆమెలో సహజంగా ఉండే చురుకు చలాకితనం మాయమైనాయి.

ప్రశాంత్ పెరట్లో మొక్కల దగ్గరికి వెళ్ళినా అనుమానమే!

'ఆడది జీవితంలో ఒకరినే ప్రేమించి సంకుచిత మనస్తత్వంతో పడి ఉంటుంది. మన మగవాళ్ళది ఎంతో విశాల హృదయం. ఏ ఆడది కనిపించినా టక్కున ప్రేమించేస్తుంది. ఎంతమందినైనా సరే' అని ఆ సినిమా హీరో తన ఫ్రెండ్‌తో అన్న మాటలు దీప చెవుల్లో మారుమ్రోగిపోతున్నాయి.

"అమ్మో!- ఆ హీరో ఎంత తెంపరి!" ఆఫీసులో లేడీ టైపిస్టుతో సాగించిన ప్రేమాయణం పెళ్లాం ముందు బైటపడిపోయి ఇంక జన్మలో మళ్ళీ అటువంటి తప్పుడు పనులు చేయనని ఆమెకి మాట యిచ్చి చెంపలు వాయించుకొని గుంజీలు తీసి క్షమాపణలు కోరాడు. మర్నాడే మళ్ళీ గ్రంథం ప్రారంభిస్తాడు. పైగా 'మగవాళ్లంతా ఇంతే' అంటూ సూక్తులు వల్లె వేస్తాడు. అదిగో ఆ సూక్తే తన మనసును వెంటాడి వేధిస్తోంది.

ప్రశాంత్ ఫిలమ్ యాక్టింగ్‌లో డిప్లొమా తీసుకున్న సంగతి గుర్తొచ్చింది దీపకి. 'అలా తీసుకున్న వాళ్లంతా జీవితంలో యాక్ట్ చెయ్యాలి అని బ్రహ్మ ఏమైనా రాసి పెట్టాడా?' అంటూ దీపను ఆమె మనసు నిలదీసింది.

ప్రశాంత్ ఆఫీసులో కూడా ఒక అందమైన లేడీ టైపిస్టు వుంది. ప్రశాంత్ పెద్ద ఆఫీసరు కాబట్టి పొద్దస్తమానం ఆ టైపిస్టు అతని గదిలోనే ఉంటుంది.

ఒక సీనులా దీప కళ్ల ముందు మెదిలింది. 'తన గదిలో లేడీ టైపిస్టు ఉన్నంత మాత్రాన ప్రశాంత్ ఆమె వలలో పడాలని రూలుందా? ప్రశాంత్ నిన్ను ఎంత ప్రేమగా చూసుకుంటాడు. అటువంటి వాణ్ణి ఇంతేనా నువ్వు అర్థం చేసుకునేది. నీ పద్ధతి ఏమి బాగాలేదు' చనువుగా మందలించింది మనసు.

మనిషి ఎంత మంచివాడయినా హీరోలా ఉన్న ప్రశాంత్ వెంట ఏ ఆడదీ పడకుండా ఉంటుందని ఏమిటి గ్యారంటి? పోనీ తన అనుమానం ఖాయం చేసుకొనేందుకు ఇంతవరకు ఎటువంటి ఆధారమూ దొరకలేదు. అలా దొరకలేదు కాబట్టి ప్రశాంత్ నిష్కళంకుడని అనుకుందామంటే ఆ హీరో మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

అందుకే మళ్ళీ అనుమానం.

పైకి చెప్పుకోలేని ఆవేదన.

'భగవాన్ ... నాకెందుకీ పరీక్ష. ఈ మథనకి అంతం లేదా ...' గట్టిగా కళ్ళు మూసుకుని పరి పరి విధాల ఆలోచించుకున్న దీపకి బాధపడటం తప్ప మరో దిక్కు తోచలేదు.

నీరసంగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా ప్రశాంత్ కనిపించాడు.

ఉలిక్కి పడింది దీప.

'తలుపులు తెరిచి కళ్ళు మూసుకుని ఏంటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ దీపా. ఎందుకు నీలో నువ్వే బాధపడుతున్నావ్?' సూటిగా ప్రశ్నించాడు ప్రశాంత్.

'ఆఁ ... ఆలోచనా ... బాధా ... ఏం లేదే' ఇంత నేరుగా భర్త తనను ప్రశ్నిస్తాడని ఊహించని దీప సమాధానం చెప్పలేక తడబడిపోయింది.

'నువ్వలా అన్నంత మాత్రాన నేను కనిపెట్టలేననుకున్నావా. నిజం చెప్పు దీపా మనిద్దరం కలిసి ఆ సినిమా చూసినప్పట్నుంచీ నీలో ఈ మార్పు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది అవునా'.

దెబ్బతిన్న పక్షిలా దీప అతని వంక బిత్తర చూపులు చూసింది.

'ఆ సినిమాలో హీరో మాదిరి నేను కూడా మా ఆఫీసులో లేడీ టైపిస్టుతో వ్యవహారం సాగిస్తున్నానేమోనని నీ అనుమానం కదూ'.

తన మనసులోని మాట భర్త బైట పెట్టేసరికి అవాక్కయిపోయింది దీప.

'నీ అనుమానం బైట పెడితే ఎటువంటి పరి





ధర్మపథం

ఎన్నో వేల సంవత్సరాల కిందటనే చెప్పారు, మనవారు "కన్యా వరయతే రూపం, మాతా విత్తం" అని వివాహ విషయంలో. అంటే– అందగాడైన భర్త కావాలని కన్య కోరుకుంటుంది. ఆమె తల్లి ధనాన్ని కోరుకుంటుంది. అంటే – ఆమెకు డబ్బు కావాలని కాదు. శ్రీమంతుల యింట్లో పిల్లనివ్వాలని ఆమె కోరిక. అలా చేస్తే అమ్మాయి సుఖపడుతుందని ఆమె ఆశ. రోజులు మారాయి. వరుడు ఎలా వున్నా, అతనికి అందకత్తె అయిన అమ్మాయి కావాలి అతని తల్లికి ధనం కావాలి. అంటే వరకట్నం యింత అని ఆమె నిర్ణయించాలి. ఎక్కువ కట్నం యిచ్చిన వారే ఆమెకు నచ్చుతారు. వారే మంచివారు, యోగ్యులు. ఆ కట్నంతో పాటు అత్తగారి లాంఛనాలు, ఆడబడుచుల లాంఛనాలు, నగలూ కావాలి. అమ్మాయి ఉద్యోగం చెయ్యాలి. ఉద్యోగం చేస్తే ఆ జీతం సొమ్ము కూడా తమకే దక్కుతుంది గదా! ఈ అభిప్రాయం ఉండే వరుని మాతృదేవతకు – తన కుమార్తెకు తక్కువ కట్నంతో – వీలయితే కట్నం లేకుండానే – అందగాడైన వరుడు దొరకాలి. లాంఛనాల నిర్బంధం, ఉద్యోగ ప్రసక్తి ఉండ కూడదు. ఇప్పుడు మధ్య తరగతి కుటుంబాలలో జరుగుతున్న పద్ధతియే ఇది! వరకట్నం వరుడికి చెందదు. అది అతని తల్లికి చెందవలసినదే. ఆమె యిష్ట ప్రకారమే దాన్ని వినియోగించవలసి ఉంటుంది. దీన్ని పరిశీలించి చూస్తే ఆడదానికి శత్రువు ఆడదే అని గ్రహించ వచ్చును.

తక్కిన వన్నీ అనుకూలంగా ఉన్నా, చాలా వివాహాలు బుసిగి పోవడానికి ప్రధాన కారణం వరశుల్కమే! వరుని తల్లి మూలంగానే చాలా మట్టుకు వివాహాలు కుదరకుండా పోతాయి. ఆమె తన కోరికను వరుని మీద, భర్త మీద త్రోసి, తాను ఏమీ ఎరగనట్టు నటించడం పరిపాటి. పెండ్లి విషయంలో ఆమె మాటకు తిరుగు ఉండదు. నూటికి తొంభై పాళ్ళు ఇలా జరుగు తున్నది. వరశుల్కం తీసుకునే పెళ్ళికి సమ్మతించనని కన్య చెప్తే ప్రయోజనం లేదు. కాబోయే అత్తగారి నోటి నుండి ఆ మాటరావాలి. ఆమె వరకట్న నిషేధాన్ని మనసారా కోరితే– ఇంటి మగవారు ఎదురు తిరగరు. ఎదురు తిరుగలేరు. శాసనాల వల్ల ఏమీ ప్రయోజనం లేదు. ఈ విషయంలో వరుల తల్లులు విశాలాశయాలతో ముందుకు వస్తే ఈ వరశుల్క సమస్య పరిష్కార మవుతుంది. అంతే కాని ఉపన్యాసాల వల్ల, ప్రచారం వల్ల కూడా లాభం ఉండదు.

–బులుసు వేంకట రమణయ్య

స్థితులు ఎదురవుతాయోనని నీ భయం. అందుకే నీలో నువ్వే బాధపడుతున్నావ్. అంతేనా' నిక్కచ్చిగా నిలదీశాడు ప్రశాంత్.

ఊహించని పరిణామం ఎదురవటంతో ఏం చెప్పాలో తోచక ఏదో తెలియని భావంతో నిలువెల్లా చిగురుటాకులా కంపించి పోయింది దీప.

'లే ... లేదు ... అది ... అదేం కాదు' అన్న మాటలు మాత్రం అనుమతి తీసుకోకుండానే దీప పెదవుల నుండి బైటికొచ్చేశాయి.

'ఆ రోజు సాయంత్రం నేను టాంక్‌బండ్‌కి వెళ్ళినప్పుడు నువ్వు అనుమానంతో నా వెంట రావటం నేను గమనించలేదనుకున్నావా?

దిగ్భ్రాంతిగా భర్త వంక చూసింది దీప.

ఇంత నిశితంగా తనను గమనిస్తున్నాడని ఊహించలేదు.

విడిన మబ్బు

నెమ్మదిగా దీప భుజంమీద చెయ్యివేసి 'లేనిపోని అనుమానాలు పెట్టుకుని ఇలా నీలో నువ్వే కృశించిపోకు దీపా. ఏదైనా ఉంటేనన్ను సూటిగా అడిగేసెయ్. నేనేమి అనుకోను. అంతేకానీ నువ్వు కనక ఇలాగే ఉంటే రేపు నీకేదయినా ... అయితే ... నేనెలా తట్టుకుంటాననుకున్నావ్. కావాలంటే చెప్పు ఈ ఉద్యోగానికి రేపే రిజైన్ ఇస్తాను. ప్రయత్నిస్తే ప్రశాంతమైన బ్రతుకుతెరువు దొరక్కపోదు. నేను నీ కోసమే జీవిస్తున్నాను. నన్ను నమ్ము దీపా నన్ను నమ్ము ...' ప్రశాంత్ కళ్ళు కుండపోతగా వర్షించటానికి సిద్ధంగా ఉన్న మేఘాల్లా ఉన్నాయి.

కానీ ఆ పని దీప చేసింది.

అమాంతం లేచి భర్త రెండు చేతులూ పట్టుకుని 'నన్ను క్షమించండి .. నిజంగా ఇన్నాళ్ళూ నేనెంత వక్రంగా ఆలోచించాను. నా పాపానికి నిష్కృతిలేదు. దేవుడులాంటి మిమ్మల్నే అనుమానించాను. నాకేదైనా ఘోరమైన శిక్ష వెయ్యండి. లేకపోతే నేను భరించలేను. ప్లీజ్ ...' దీప కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

ఆమె కళ్ళు వాచినాయి.

పశ్చాత్తాపంతో ఆమె నిలువెల్లా దహించుకు పోతోంది.

'ఛ ... అవేం మాటలు దీపా. నీ అనుమానం తీరింది అదే నాకు కొండంత బలం. ఇవాళ హోటల్లోనే మన డిన్నర్ ఓ. కే. ఏదీ ఒకసారి నవ్వు' అంటూ గిలిగింతలు పెట్టాడు ప్రశాంత్.

గోదారిలా గలగలానవ్వేసింది దీప. ఆకాశాన్ని అప్పటివరకు కమ్మిన మేఘాల తెరలు విచ్చుకున్నాయి. □